20.06.2020



4-50

## మున్నుడి

తనతండ్రి అన్నమాచార్యులవారి అడుగుజాడల ననుసరించిన పెద తిరుమలాచార్యులవారు కూడ వెంకటేశ్వర ముకుటంతో అనేక కీర్తనలు రచించారు. ప్రతిదేవునీ అయన శ్రీవేంకటేశ్వరునిగానే భావించారు. ఈ కీర్తనలో గోపికలలో తానూ ఒకతెయై కృష్ణునితో మొరబెట్టుకొంటున్నారు. నీ భావమేమిటో మాకు తెలిసిపోయిందిలే గోపాలకృష్ణా! నీ పస నాకు తెలియదా? నీకు కూడా బమ్మెరపాటు వుంటుందా? (నీవు దేవదేవుడవు కదా!)

కం॥ గోవింద నందసుత! నీ
భావము గోపాలకృష్ణ! మాకటు చిక్కెన్
శ్రీవేంకటేశు గొలుచుచు
ఈ విధి పెదతిరుమలయ్య ఇంపుగ పాడెన్

రాగం : మిశ్రమోహన

గోవింద నందనందన గోపాలకృష్ణ నీ-
భావము మాకు చిక్కె గోపాలకృష్ణ ॥గోవింద॥

కొంగువట్టే వదేమోయి గోపాలకృష్ణా మా-
పంగెన కోపుదువా గోపాలకృష్ణ
గొంగతనాల నవ్వేవు గోపాలకృష్ణ
బంగారు కాశతోడి గోపాలకృష్ణ ॥గోవింద॥

కొమ్మల చీరె లంటిన గోపాలకృష్ణ
పమ్మి నిన్ను తిట్టము గోపాలకృష్ణ
కుమ్మరించే వేల సిగ్గు గోపాలకృష్ణ
బమ్మెర పోకిందుల గోపాలకృష్ణ ॥గోవింద॥



Scanned with CamScanner

కొసరకు మంత నీవు గోపాలకృష్ణ నీ-
పస నే నెఱుగనా గోపాలకృష్ణ
పొసగ శ్రీవేంకటాద్రి పొందితి నిన్ను
పసి మెక్కె మొగము గోపాలకృష్ణా ॥గోవింద॥

భావామృతం :

నందగోపుని కుమారుడవైన గోవిందా! నీవు గోవులను పాలించే గోపాలకృష్ణుడవు. నీ ఆలోచనలేమిటో మాకు దొటికిపోయినవి. (నీ జిత్తులు మేము గ్రహించితిమి. మేము వెర్రిగొల్ల కన్నెలం కావచ్చును. కాని నీకిటుకులన్నీ మేమెరుగుదుములేవయ్యా!)

ఓ గోపాలకృష్ణా! మా కొంగు పట్టేవు ఇదేమోయి? నీ పంగెన (జిత్తులు) మేము సహించలేమయ్యా! (పంగెన అంటే ఏనుగును బంధించే పెద్దగొయ్యి. పైన గడ్డి కప్పివుంచిన వ్యూహం) గొంగతనాల నవ్వేవు (కపట శత్రువువలె నవ్వుతున్నావు). ఇది నీకు తగునా కృష్ణా! బంగారు రంగు కాశ (చిన్న పంచె) కట్టినావు గోపాలకృష్ణా! (నీవు పీతాంబరుడవని అందుకే అన్నారు).

స్త్రీల చీరలెత్తుకొని పోయిన ఓ గోపాలకృష్ణా! మేము నిన్ను పమ్మితిట్టము లేవయ్యా! (అతిగా నిందించము). మేము నీతో ఇంత మంచితనం చూపిస్తే... నీవేమో మా సిగ్గులన్నీ కుమ్మరించేస్తున్నావు (బట్టబయలు చేస్తున్నావు). మమ్మల్ని బమ్మెరపోకునకు (భ్రమపాటునకు) ఇందుల (ఇక్కడ) గురిచేస్తున్నావు. గోపాలకృష్ణా! ఇది న్యాయమా?

ఓ గోపాలకృష్ణా! నీవు అంత కొసరకుము స్వామీ! (ఇంకాస్త... ఇంకాస్త... అని మా వలపులు దోచుకోవద్దు). నీ సామర్థ్యం మేమెరుగనిదా!! కృష్ణా! అటువంటి నిన్ను శ్రీవేంకటాద్రిమీద శ్రీవేంకటేశ్వరుని రూపంలో పొందినాము. అందుచేత మా మొగములు కాంతులతో వెలిగిపోతున్నాయి ప్రభూ!



Scanned with CamScanner